

సాక్షి
గుంటూరు
మంగళవారం ၊ 10 ၊ డిసెంబర్ ၊ 2024



శరవేగంగా ఆలయ నిర్మాణం

చెరుకుపల్లి: ఆరుంబాక గ్రామంలోని నెల్లెమ్మ తల్లి ఆలయాన్ని సుమారు రూ.1.25 కోట్లతో పునర్నిర్మాణం చేస్తున్నారు. ఫిబ్రవరి 7న ఆలయ ప్రతిష్ట చేస్తారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 584.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జలపాలేశ్వరుడికి పూజలు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర స్వామికి సోమవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

బీఎస్సీ అగ్రి కమ్యూనిటీ సైన్స్ ఎన్‌ఆర్‌ఐ కోటా స్పాట్ అడ్మిషన్స్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాల్లో బీఎస్సీ అగ్రికల్చర్(హానర్స్) కమ్యూనిటీ సైన్స్ ఎన్ఆర్ఐ కోటాలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీస్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ లాంఫాం నందు ఉదయం 10 గంటనుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పాపం పసివాడు

మహిళా ప్రాంగణంలో వదిలేసి వెళ్లిన గుర్తు తెలియని యువకులు



లక్ష్మీపురం: జిల్లా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మహిళా ప్రాంగణంలో రెండు సంవత్సరాల వయస్సున్న బాలుడిని వదిలి వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహిళా ప్రాంగణంలో రెండు సంవత్సరాల బాలుడిని గుర్తు తెలియని యువకులు వదిలి వెళ్లారు. బాలుడిని గమనించిన ప్రాంగణం నిర్వాహకులు నగరంపాలెం పోలీసులకు అప్పగించారు. వారు బాలుడితో మాట్లాడేందుకు ప్రయత్నించినా మాట్లాడలేదు. బిత్తర చూపులు చూస్తున్నాడు. బాలుడు గురించి ఆచూకీ తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863- 2234047 లేదా నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ 8688831336 నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

14, 15 తేదీల్లో జాతీయ ఎస్సీ కమిషన్ సమావేశాలు

గుంటూరు మెడికల్: విజయవాడలో ఈనెల 14, 15 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. తొలిరోజు విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ, రెండో రోజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవనంలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ పరశురామ్, రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య హాజరవుతారని వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశంలో వేదిక హక్కుల, ఆశయాలు గురించి వివరిస్తారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ, తీర్మానం చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు.

యార్డుకు 48,006 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 48,006 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,998 అమ్మకాలు జరిగా యి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,664 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

అభాగ్యులపై కొరడా

ఝుళిపింఛన్

- పైలెట్ ప్రాజెక్టుగా చేబ్రోలు మండలం వేజెండ్ల ఎంపిక
- ప్రత్యేక బృందాలతో ఇంటింటి పరిశీలన
- ఆరు పాయింట్లతో విచారణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే ఏడు వేల పింఛన్ల కోత
- తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్న పెన్షనర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ చేబ్రోలు: పండుటాకులపై ప్రతాపం చూపించడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. పింఛన్ల కోత మొదలెట్టింది. వెరిఫికేషన్ పేరుతో తొలగించే ప్రయత్నాలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా 6,798 పింఛన్లు వివిధ పేర్లతో తొలగించారు. తాజాగా పైలెట్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో తనిఖీ చేశారు. పింఛన్‌దారుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ మరోసారి వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ వివరాలు సేకరించారు.

వివరాలను కూపీ లాగుతున్న అధికారులు

ప్రభుత్వం సేకరిస్తున్న వివరాలు గమనిస్తే పూర్తిగా పింఛన్లు కోత విధించడంపైనే దృష్టి పెట్టినట్లు ఉందని అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. పింఛన్‌దారులకు ఎంత సాగు భూమి ఉంది, అందులో మాగాణి ఎంత ? మెట్ట ఎంత ఉందనే వివరాలు సేకరిస్తున్నారు. పింఛన్‌దారుడు గతంలో ఏ పని చేసేవాడు..ప్రభుత్వ ఉద్యోగమా? ప్రైవేటు ఉద్యోగమా? అనే వివరాలతో పాటు వారికి ప్రతి నెలా కరెంట్ బిల్లు ఎంత వస్తోంది పరిశీలిస్తున్నారు. ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాల తనిఖీతో పాటు ఆస్తి వివరాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు చేస్తున్న పని, నెలకు ఎంత ఆదాయం వస్తుందనే వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఇంట్లో వారికి ఉన్న ఆటోలు, కార్లు , లబ్ధిదారుని పేరుతో ఏం ఉన్నాయనేది పరిశీలిస్తున్నారు.

పెన్షన్ల పరిశీలన ప్రారంభం



వేజండ్ల-2 గ్రామ సచివాలయం పరిధిలో పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ టి. విజయలక్ష్మి, తెనాలి డీఎల్‌పీవో శ్రీదేవి తదితరులు

16 ప్రత్యేక బృందాలతో జల్లెడ

చేబ్రోలు మండలం వేజండ్ల-2 గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం పింఛన్ వెరిఫికేషన్‌ను జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద మొదలు పెట్టారు. వేజండ్ల-2 సచివాలయం పరిధిలో 650 మంది లబ్ధిదారులు ఉన్నారు. పరిశీలనకు గాను తెనాలి డివిజన్ పరిధిలోని ఈవోపీఆర్డీలు, ఏవోలు, ఎంఈవోలు, సచివాలయ సిబ్బందితో 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఒక్కో బృందానికి ఇద్దరు సభ్యుల చొప్పున పరిశీలన చేపట్టారు. లబ్ధిదారుల నుంచి వివిధ అంశాలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఫొటోలను సేకరించారు. వెరిఫికేషన్ ప్రక్రియను డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. విజయలక్ష్మి, తెనాలి డీఎల్‌పీవో శ్రీదేవి పర్యవేక్షించారు. గ్రామంలో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ తిరిగి వివరాలను నమోదు చేసుకుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు.





బాధితుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- ప్రతి శాఖలో ఎన్ని పెండింగ్ అర్జీలున్నాయో తెలపాలని ఆదేశం

గుంటూరు వెస్ట్: ప్రజల అర్జీలు పరిష్కారంలో కొన్ని శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి శాఖలోనూ ఎన్ని అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను తనకు అందించాలని ఆదేశించారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. తమ అర్జీలను ప్రజలు స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చని సూచించారు. దీంతో సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని అధికారులకు తెలిపారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి అర్జీలు వెళితే సంబంధిత అధికారికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన 172 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

దాడులకు తెగబడుతున్న అగ్ర కులస్తులు



తమకు ఓటు వేయలేదని అధికార పార్టీకి చెందిన అగ్రకుల పెద్దలు మమ్మల్ని కులం పేరుతో దూషించడంతోపాటు గాయపరిచారు. మొత్తం నాలుగు కేసులు పెట్టారు. నెల రోజుల పోరాటం తర్వాత ఒక కేసు మాత్రమే రిజిస్టర్ చేశారు. మాకు ప్రాణహాని ఉంది. న్యాయం చేయాలి.

– బాధిత దళిత మహిళలు, ఫిరంగిపురం మండలం, గరుడాచలపాలెం గ్రామస్తులు

అన్ని పనులు మాతోనేనా ?

మేము పేరుకు మాత్రం గ్రామ వ్యవసాయ సహాయకులం. కాని అన్ని పనులు మాతోనే చేయిస్తున్నారు. కనీసం ఒక్క క్షణం కూడా తీరిక ఉండడం లేదు. ఈ-క్రాప్ బుకింగ్ మొదలు కొని పంట చేతికొచ్చే వరకు సంబంధించిన అన్ని పనులు మేమే చేయాల్సి వస్తోంది. మాకు కేటాయించిన విధులు మాత్రమే చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలి.

– వీఏఏల అసోసియేషన్ నేతలు



పెద్ద నోట్ల రద్దు నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను ఊగిసలాడించిందనే చెప్పొచ్చు. ప్రభుత్వం మొదట వెయ్యి రూపాయల నోట్లను రద్దు చేసి కొత్తగా రూ.2 వేల నోట్లను ప్రవేశ పెట్టడం తెలిసిందే. ఆ తర్వాత పాత రూ.500 నోట్లు రద్దు చేసి వాటి స్థానంలో కొత్త డిజైన్ నోట్లను తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా నాణేల విషయంలో రూ.10, రూ.20 ప్రవేశపెట్టారు. బరువురీత్యా కొన్ని ప్రాంతాల్లో వాటిని తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. దీంతో బ్యాంకుల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఒక దశలో రూ.10 నాణేన్ని బ్యాంకర్లు సైతం నిరాకరించే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రూ.20 నాణేలు చలామణిలో పెద్దగా లేవు. రూ.10 నాణేలను తీసుకునేందుకు కొంతమంది వెనుకాడుతున్నారు. చాలా మంది పేదలు, డిజిటల్ పేమెంట్స్ తెలియని వారు తమ వద్ద నాణేలున్నా చలామణిలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిల్లర మాలక్ష్మితో

చిక్కులు

- మార్కెట్లో రూ.10, రూ.20 నోట్ల కొరత
- నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తున్న వ్యాపారులు
- ప్రజల్లో సందేహాలు
- ఆర్‌బీఐ నివృత్తి చేసినా తప్పని కష్టాలు



కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్‌లో చిల్లర కష్టాలు అధికమయ్యాయి. ప్రజలు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. క్రయవిక్రయాల్లో రూ.10, రూ.20 నోట్ల కొరత వేధిస్తోంది. అధిక సంఖ్యలో చలామణిలో లేకపోవడంతో ప్రజలు చిల్లర కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారు. దీన్ని అధిగమించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) రూ.10, రూ.20 నాణేలను చలామణిలోకి తెచ్చింది. వాటిపై ప్రజలకు అవగాహన లేక కొంతమంది తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. చాలా చోట్ల డిజిటల్ పేమెంటు చేస్తున్నప్పటికీ కొంతమంది అవగాహన లేని చిరు వ్యాపారులు, బడ్డీకొట్ల వారు నగదుతో వ్యాపారాలు చేస్తూ చిల్లరతో కుస్తీలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నో సంవత్సరాల కిందట చలామణిలోకి వచ్చి వాడుక లేక మరుగునపడిన రూ.10, రూ. 20 నాణేలు బయటకు వచ్చాయి. వీటిని తీసుకుంటే చెల్లుతాయో లేదో అనే అనుమానంతో పలువురు వ్యాపారులు తటపటాయిస్తున్నారు. మరికొందరు నిర్మొహమాటంగా నిరాకరిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ స్పందించింది. రూ.10, రూ.20 నాణేలు చెల్లుబాటు అవుతాయని, ఎవరైనా తిరస్కరిస్తే ఫిర్యాదు చేయాలని సూచించింది. క్రయవిక్రయాల్లో నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తే ఐపీసీ సెక్షన్ 124 కింద ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసింది.

దేశీయ కరెన్సీలో పెను మార్పులు

గడచిన దశాబ్దంలో దేశీయ కరెన్సీలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. రూపాయి నోటు నుంచి రూ.2 వేల నోటు వరకు విభిన్న రంగులు, డిజైన్లలో నోట్లు చలామణిలో ఉన్నాయి. నాణేలు మొదలుకుని నోట్ల వరకు డిజైన్లలో తరచూ జరుగుతున్న మార్పులు ప్రజల్లో పలు సందేహాలకు తావిస్తున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసేందుకు బ్యాకర్లు, ఆర్‌బీఐ ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండటం లేదు. చాలా కాలం రూ.10, రూ. 20 నాణేలు మార్కెట్‌లో చలామణిలో లేవు. ఈ క్రమంలో మార్కెట్‌లోకి రావడంతో ప్రజల్లో సందేహం నెలకొంది. ఈ క్రమంలో ఆర్‌బీపై తాజాగా ఓ హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వం ఆమోదించిన నాణేలను తిరస్కరించడం నేరం అవుతుందని స్పష్టం చేసింది.

నాణేలన్నీ చెల్లుబాటు అవుతాయి



రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టన నాణేలు రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 అన్నీ చెల్లుబాటు అవుతాయి. రోజువారీ వ్యాపారులు క్రయవిక్రయాలకు వీటిని నిరభ్యంతరంగా వినియోగించవచ్చు. ప్రస్తుతం రూ.20 నాణేలు అందుబాటులో లేవు. ప్రభుత్వం ఆమోదించిన నాణేలను క్రయవిక్రయాలకు నిరాకరించడం చట్టరీత్యా నేరం. వారిపై ఫిర్యాదులు అందితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– మహిపాల్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్, గుంటూరు జిల్లా

రైతు సమస్యలపై పోరాడుదాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపు
- నేడు, రేపు జిల్లావ్యాప్తంగా పర్యటన
- వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్ ఆదేశాల మేరకు 13న కలెక్టర్‌కు వినతిపత్రం
- పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్యనేతలతో సమావేశం



సమావేశంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు పల్నాడు జిల్లాల పార్లమెంటరీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మేయర్ కావటి మనోహరనాయుడు తదితరులు

పట్నంబజారు: రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచేలా పోరాటానికి సన్నద్ధం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీర్మానించాయి. నేరుగా వారినే కలిసి ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, కూటమి ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితులను అధ్యయనం చేసేందుకు నేతలు సమాయాత్తమయ్యారు. ఈ మేరకు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షతన పార్టీ గుంటూరు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డితో సమావేశమయ్యారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 13న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా రైతాంగ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్న నేపథ్యంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. దానిలో భాగంగా రైతులతో నేరుగా చర్చించి వారి సమస్యలు తెలుసుకునేందుకు ఆయా నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 10న మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకుంటారు. 11వ తేదీ బుధవారం ఉదయం తాడికొండ, పొన్నూరు, మధ్యాహ్నం ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. అనంతరం అదే రోజు సాయంత్రం పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ ముఖ్యనేతలు, రైతు నేతలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రైతు సమస్యలు, గిట్టుబాటు ధర, ధాన్యం సేకరణ, కొనుగోలు మొదలగు అంశాలపై రైతులను కలిసి చర్చిస్తారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు పూర్తిస్థాయిలో సమస్యలను విన్నవించేందుకు సమాయత్తం అయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

డిమాండ్ సర్వేలో నమోదు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు 2.0 డిమాండ్ సర్వేలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో వర్చువల్‌గా ఆమె మాట్లాడారు. డిమాండ్ సర్వేలో నమోదు చేసుకునే వారు మాత్రమే ఇళ్లు నిర్మించుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు హౌసింగ్ లేఅవుట్స్‌లో స్థలాలు ఉన్న వారిని గుర్తించి సచివాలయ ఉద్యోగులు డిమాండ్ సర్వేలో కచ్చితంగా నమోదు చేయాలని ఆమె చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, పోషణ్ వాటికలు ఏర్పాటు శనివారం నాటికి కచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో గృహాల మ్యాపింగ్, ఎస్సీడీ సర్వే నూరు శాతం వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, డీపీఓ సాయి కుమార్, ఉద్యాన శాఖ అధికారి రవీందర్ బాబు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

రెచ్చిపోయిన మృగాడు

- స్నేహితుడు తల్లిపై అత్యాచారయత్నం
- అరగంట సేపు పెనుగులాడిన బాధితురాలు
- పలుచోట్ల గాయాలు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



తెంపర్ల రామారావు (ఫైల్)

తాడేపల్లి రూరల్ : మద్యం మత్తులో స్నేహితుడు తల్లిపై ఓ యువకుడు అత్యాచారయత్నం చేసిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం .. పట్టణంలోని ఓ ప్రాంతంలో బాధితురాలు (50) ఉంటోంది. అక్కడే నివాసముండే తెంపర్ల రామారావు పలుమార్లు స్నేహితుడు ఇంటికి వెళ్లి బాధితురాలు అయిన అతడి తల్లితో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆమె చేసిన వంటలు తిని బాగున్నాయి అమ్మా ! అంటూ పొగిడేవాడు. ఈ చనువుతో రామారావు మనసులో దురుద్దేశం పెట్టుకుని సోమవారం తెల్లవారుజామున స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అతడు ఇంట్లో లేడు. తలుపు తీయమని అడగడంతో తెలిసిన వ్యక్తి కదా బాధితురాలు తలుపు తీసింది. ఒక్కసారిగా రామారావు ఆమెను మంచంపై పడవేసి విచక్షణారహితంగా ప్రవర్తించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అరవొద్దు అంటూ నోరు మూసి, దుస్తులను చించేందుకు ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో బాధితురాలికి పలుచోట్ల గాయాలయ్యాయి. చివరకు ఆమె అతడి నుంచి తప్పించుకుని పెద్ద పెద్దగా కేకలు వేస్తూ పరిగెత్తింది. ఆమె కేకలకు స్థానికులు రోడ్డుమీదకు రావడంతో రామారావు పరారయ్యాడు. బాధితురాలి బంధువులు రామారావు ఇంటికి వెళ్లి నిలదీయగా తమకు ఏమి తెలియదని సమాధానం చెప్పారు. దీంతో జరిగిన సంఘటనపై బాధితురాలు బంధువులతో కలసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు రామారావును ఎట్టకేలకు గుర్తించారు. అతడు గతంలో కూడా ఇలాంటి ఘటనలకు పాల్పడినట్లు, స్థానికంగా ఉన్న రాజకీయ నాయకులతో సెటిల్‌మెంట్లు చేయించుకున్నట్లు సమాచారం. రామారావు తాడేపల్లిలో ఉన్న పలువురు జేబుదొంగల వెంట తిరిగి వారికి సహాయ సహకారాలు అందిస్తున్నాడని పలువురు తెలియజేశారు. రామారావు లాంటి వారిని కఠినంగా శిక్షించాలని బాధిత మహిళ బంధువులు కోరుతున్నారు.

క్లుప్తంగా

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

వివరాలు వెల్లడించిన డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అయ్యప్ప భక్తులు శబరిమల వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ తెలిపారు.

- రైలు నంబర్ 07167 (మౌలాలి–కొట్టాయం) వయా గుంటూరు డివిజన్ మీదుగా 2025 జనవరి 3,10,17,24,31వ తేదీల్లో నడుస్తుంది. మౌలాలి స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి కొట్టాయం స్టేషన్‌కు మరుసటి రోజు సాయంత్రం 6.45 గంటలకు చేరుకుంటుంది.
- రైలు నంబర్ 07168 (కొట్టాయం–సికింద్రాబాద్) జనవరి 4,11,18,25,ఫిబ్రవరి 1వ తేదీల్లో ప్రయాణిస్తుంది. ఈ రైలు కొట్టాయం స్టేషన్ నుంచి రాత్రి 9.45 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్‌కు మరుసటి రెండో రోజు రాత్రి 1.30 గంటలకు చేరుకుంటుంది. చర్లపల్లి, నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కట్‌పడి, జొలార్‌పట్టి, సేలం, ఈరోడ్, త్రిపూరా, కోయంబత్తూర్, పాలక్కాడ్, త్రిసూర్, ఆలువా, ఎర్నాకులం మీదుగా ప్రయాణిస్తుంది.
- రైలు నంబర్ 07169 (కాచిగూడ–కొట్టాయం) జనవరి 5,12,19,26వ తేదీల్లో నడుస్తుందని తెలిపారు. కాచిగూడ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలు దేరి రెండో రోజు రాత్రి 6.50 గంటలకు కొట్టాయం స్టేషన్‌కు చేరుకుంటుంది.
- రైలు నంబర్ 07170 (కొట్టాయం–కాచిగూడ) జనవరి 6,13,20,27 తేదీల్లో నడుస్తుంది. కొట్టాయం స్టేషన్ నుంచి రాత్రి 8.50 గంటలకు బయలుదేరి కాచిగూడ స్టేషన్ రెండో రోజు రాత్రి 1 గంటకు చేరుకుంటుంది. మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, జొలార్‌పట్టి, సేలం, ఈరోడ్ త్రిపూరా, కోయంబత్తూర్, పలక్కాడ్ త్రిసూర్, ఆలూవా, ఎర్నాకులం మీదుగా ప్రయాణిస్తుంది.

పట్టుబడిన రేషన్ బియ్యం

నాదెండ్ల: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జి.పుల్లారావు కథనం మేరకు తూబాడు గ్రామానికి చెందిన రఘు అక్రమంగా సేకరించిన రేషన్‌బియ్యాన్ని 50 కేజీల బరువైన 40 బస్తాలను (10 క్వింటాళ్లు) ఆటోలో ఫిరంగిపురం తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రఘును అరెస్టు చేశారు.

టీడీపీలో 'బెంచీ' రాజకీయం

- గుంటూరు పశ్చిమ తెలుగుదేశం పార్టీలో లుకలుకలు
- పార్టీ నేత నాని ఏర్పాటు చేసిన బెంచీలు సైతం తొలగింపు



బెంచీలను తొలగించిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీలో వాడుకుని వదిలేయడం ఆనవాయితీగా మారింది. పార్టీ కష్టకాలంలో సర్వశక్తులు ఒడ్డిన వారికి ఇప్పుడు ప్రభుత్వం రాగానే మొండిచెయ్యి చూపించారు. పైగా అతని ఆనవాళ్లు కూడా నియోజకవర్గంలో లేకుండా చేయాలని చూడటం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కోవెలమూడి రవీంద్ర(నాని) పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా తలబడ్డారు. మిగిలిన కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు కోసం ఆర్థికంగా కూడా తోడ్పాటు అందించారు. అయితే, తెలుగుదేశం పార్టీ ఆ ఎన్నికల్లో ఓటమి చవి చూసింది. కౌన్సిల్‌లో ఫ్లోర్‌లీడర్‌గా పార్టీ తరపున గళం వినిపిస్తూ వచ్చారు. తర్వాత గుంటూరు పశ్చిమ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మద్దాలి గిరి వైఎస్సార్‌సీపీలో చేరడంతో నాని తెలుగుదేశం సమన్వయకర్తగా పనిచేశారు. 2024 ఎన్నికల వరకూ పార్టీని భుజస్కందాలపై నడిపారు. ఎన్నికల సమయంలో ఆయనకు సీటు ఇవ్వకుండా అధిష్టానం గల్లా మాధవిని అభ్యర్థిగా బరిలోకి దింపింది. ఆమె గెలుపు కోసం కూడా నాని పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా న్యాయం జరగలేదు. నామినేటెడ్ పదవుల్లో ఏవీ నానికి దక్కలేదు. పైగా అతని ఆనవాళ్లు నియోజకవర్గంలో లేకుండా చేసే ప్రయత్నాలు స్థానిక ఎమ్మెల్యే వర్గం నుంచి జరుగుతున్నాయి. తాజాగా పశ్చిమ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం నాని ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆయన వర్గం మండిపడుతోంది. సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు. గోడలమీద నాని పేరు చెరిపినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని, ఆయన మీదున్న ప్రేమాభిమానాల వల్లే 2024లో 52 వేల ఓట్ల మెజారిటీ వచ్చిన విషయం గుర్తుంచుకోవాలంటూ పోస్టులు పెడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేకి, నానీకి మధ్య జరుగుతున్న వివాదం పార్టీలో చర్చకు దారి తీసింది.

ఉమ్మడి గుంటూరు జిల్లా క్యారమ్స్ జట్ల ఎంపిక


కనపర్రులో క్రీడాకారులతో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్14,17 విభాగాల్లో క్యారమ్స్ బాలుర, బాలికల జట్ల ఎంపిక జరిగింది. ఈ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియకు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బివీ మోహన్‌రెడ్డి పర్యవేక్షించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు త్వరలో ప్రకాశం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 14. 17 క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజశేఖర్, అబ్జర్వర్ స్వర్ణరాజు, సెలక్షన్ కమిటీ మెంబర్ ఖాదర్‌మస్తాన్, కేవీ నాగరాజు, ఏఎంజీ నాగరాజు, చినరామయ్య, ఎంవీ సుబ్బారావు, ఖాశింబుడే, ఇస్మాయిల్, భాగ్యలక్ష్మి, సైదులు, ప్రసాద్ అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులు

అండర్ 14 బాలుర క్యాటగిరీలో భాస్కర్‌నాయక్, ప్రశాంత్‌కుమార్, శశిధర్, రాజా, జయపాల్, హనుమానాయక్, స్మిత, అండర్ 17 బాలుర విభాగంలో వెంకటదుర్గాసాయి, స్టీఫెన్‌పాల్, లోకేష్ ఉన్నారు. అండర్ 14 బాలికల జట్టులో వైష్ణవి, హేమశ్రీ, పావని, ఐశ్వర్య, అమూల్యబ్లెస్సీ, అమూల్య, అండర్ 17 బాలికల జట్టులో సరళాబాయి, శరణ్య, నీలిమ, మౌనిక, రష్మిక, వెంకటపావని ఎంపికయ్యారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి : మేయర్

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదు. ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా పిలవకుండా అవమానిస్తున్నారు. ఇదే క్రమంలో ఆదివారం గోరంట్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసే క్రమంలో ప్రథమ పౌరుడైన నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడిని ఆహ్వానించలేదు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో నగరపాలక సంస్థ అధికారులు శంకుస్థాపన చేయించారు. దీనికి తోడు శిలాఫలకంపై మేయర్ పేరును ఒక చివరి వేసి చేతులు దులుపుకున్నారు. దీనిపై సోమవారం సాక్షి దినపత్రికలో 'అధికార 'పచ్చ'మే! అనే కథనం ప్రచురితమైంది.దీనికి నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు స్పందించి నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నగర ప్రథమ పౌరుడైన తనను ఆహ్వానించకుండా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడాన్ని ఫిర్యాదులో తప్పుబట్టారు. కొద్ది రోజుల కిందట జరిగిన స్టాండింగ్‌లో కమిటీ సమావేశంలో కూడా ప్రొటోకాల్ పాటించడం లేదని తెలిపారు. అధికారులు ప్రొటోకాల్ ఎందుకు పాటించలేదో తగిన వివరణ ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు.

బాధితుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


వృద్ధుని సమస్య వింటున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి బాధలను ఆలకించారు. సమస్యలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కారంకాకపోతే, అందుకు కారణాలు వారికి తెలిపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జి.వి.రమణమూర్తి, డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్), శివాజీరాజు (సీసీఎస్) అర్జీలు స్వీకరించారు.

సక్రమంగా అద్దె ఇవ్వడం లేదు

మూడేళ్ల కిందట భర్త సుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఇంట్లో అద్దెకు ఉంటున్న మహిళ గతంలో అద్దెలు చెల్లించేది. నా భర్త చనిపోయిన దగ్గర నుంచి సక్రమంగా చెల్లించడంలేదు. అదేమని అడిగితే నా ఇల్లు అని బెదిరింపులకు పాల్పడుతుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోని వస్తువులు బయటకు విసిరేసి, నాపై దాడికి పాల్పడ్డారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదు. గత నెలలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకుని, డిశ్చార్జ్ అయ్యాను. ప్రస్తుతం కేవీపీ కాలనీలోని కుమారుని వద్ద ఉంటున్నా. ఇల్లును నాకు అప్పగించి న్యాయం చేయాలి.

– ఆరే అన్నపూర్ణమ్మ, చంద్ర రాజేశ్వరరావు కాలనీ 4వ వీధి, దాసరిపాలెం

వేధింపులు భరించలేకున్నాం..

సుమారు ఐదేళ్ల క్రితం ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఇంటి పత్రాలు తనఖా పెట్టి, సుమారు రూ.8.44 లక్షల రుణం తీసుకున్నాం. మొదట్లో ఈఎంఐలు క్రమం తప్పకుండా చెల్లించాం. ఈలోగా కోవిడ్–19 రాకతో కొంతమేర కుటుంబ పరిస్థితులు అధ్వానంగా మారాయి. అప్పటి నుంచి ఫైనాన్స్ కంపెనీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఇటీవల ఇంటికి వచ్చి మా ఆవిడతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. నెలకు రూ.15 వేలు ఈఎంఐ చెల్లించాల్సిందేనని గట్టిగా చెబుతున్నారు. లేకపోతే ఈ శుక్రవారం ఇంటికి తాళాలు వేస్తామని బెదిరిస్తున్నారు. నెలకు రూ.10 వేలు చెల్లిస్తామంటే ఒప్పుకోవడంలేదు. ఈ విషయాన్ని బ్రాంచి మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా, నెలకు రూ.15 వేలు చెల్లించాల్సిందేనని కరాఖండీగా చెబుతున్నారు.

– మొహమ్మద్ అన్వర్, జరీనా, వినోభానగర్ ఏడో వీధి, పాత గుంటూరు

నేడు గుంటూరులో 'పడమటి గాలి' హోరు

- సంచలనం సృష్టించిన నాటకం 153వ ప్రదర్శన
- కరోనా పరిస్థితుల తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు


పడమటి గాలి నాటకంలో ఓ సన్నివేశం

తెనాలి: పడమటి గాలి...తెలుగు నాటకరంగంలో సంచలనం సృష్టించిన నాటకం. ఒకనాటి కన్యాశుల్కం, ఆ తర్వాత మాభూమిలా ఈనాటి 'పడమటి గాలి' ఆంధ్రుల ఇతివృత్తాలకు, సామాజిక చైతన్యానికి కొలమానంగా నిలిచింది. చరిత్రలో నిలిచిపోయే సామాజిక నాటకం. కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత 153వ ప్రదర్శనగా ప్రేక్షకుల ముందుకొస్తోంది...అది కూడా సంక్షిప్తరూపంలో. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు పండు క్రియేషన్స్, కొప్పోలు సమాజం ప్రదర్శిస్తున్నారు. గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రారంభిస్తారు.

పల్లె గుండె చప్పుడు

ఎక్కడో కొన్ని వేలమైళ్ల దూరంలో సముద్రాల కవతల ఒక బహుళజాతి కంపెనీ మెదడులో ఓ కొత్త వ్యాపారపు ఆలోచన మెరిసింది. భారత దేశంలోని ఓ మారుమూల పల్లె తల్లి గుండె చప్పుడు మారిపోతుంది...చేను చెంప చెమ్మగిల్లుతుంది. అటువంటి 'పడమటి గాలి' సోకిన ప్రకాశం జిల్లాలోని మారుమూల పల్లెటూరి వృత్తాంతమే ఈ నాటకం. ఆర్థిక సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ పెనుమాయలో పల్లెటూళ్లు ఎలా కకావికలమవుతుందీ కళ్లకు కట్టిందీ నాటకం. నగరాల్లోని విషసంస్కృతి, విలాసాల జీవిత లాలస పల్లెపైకి పంజా విసరటం, స్పీడ్‌మనీ, ఈజీమనీ మనుషులను పిచ్చివాళ్లను చేయటమే కాదు... ప్రేమానురాగాల మధ్య మెలగాల్సిన మనిషి కలుషితమై వికృతత్వాన్ని పొందుతాడు. మొత్తానికి పల్లె సహజత్వం, సౌందర్యం ధ్వంసమైపోయి, పరాయీకరణ చెందుతుంది. మట్టితోనూ, చెట్టుతోనూ సజీవ సంబంధం కలిగిన రైతు, ఆ మట్టితో తన సహజత్వాన్నీ, అస్తిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ నిలుపుకోవాలని అనుకుంటాడు. పడమటి గాలి నాటకం ఇతివృత్తం సంక్షిప్తంగా ఇదే.

దివికుమార్ వ్యాస సంపుటి ఆవిష్కరణ

'పడమటి గాలి' నాటకంపై ఎన్నో సమీక్షలు వచ్చాయి. దేశవ్యాప్తంగా పత్రికలు ప్రత్యేక కథనాలను ప్రచురించాయి. వీటితోపాటు జనసాహితి నేత, ప్రముఖ రచయిత దివికుమార్ ఇదే నాటకంపై దాదాపు 15 వ్యాసాలను రచించారు. జనసాహితి ప్రచురించిన దివికుమార్ వ్యాస సంపుటిని నాటక ప్రదర్శనకు ముందు ఆవిష్కరించనున్నారు. నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు ఆవిష్కస్తారు.

పుష్ప విలాసం



ప్రత్తిపాడు పరిసర ప్రాంతాలు అంటే గుర్తుకువచ్చేది పత్తి, మిర్చి సాగు. దశాబ్దాలుగా ఇవే పంటలు ఈ ప్రాంతంలో సాగుచేస్తుంటారు. కానీ ఇటీవల రైతుల ఆలోచనా ధోరణి మారుతోంది. ప్రత్యామ్నాయ పంటల వైపు ఈ ప్రాంత కర్షకులు దృష్టి సారిస్తున్నారు. అపరాలు, కూరగాయలు, పూలు, పండ్ల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అందులో భాగంగానే బంతి పూల తోటలు కూడా సాగుచేశారు. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి పుల్లడిగుంట సమీపంలో పండించిన బంతి పూలు పసుపు, ఆరెంజ్ రంగుల్లో చూపరులను ఆకర్షిస్తున్నాయి. తుషార తుంపరలు పూలపై కురుస్తూ ఉదయం సమయంలో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. –ప్రత్తిపాడు

కుట్లు వేయడంపై వైద్య విద్యార్థులకు వర్క్‌షాప్


వర్క్‌షాపులో సూచరింగ్ మెటీరియల్ పరిశీలిస్తున్న డాక్టర్ సుందరాచారి, డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థులకు, జూనియర్ వైద్యులకు ఆపరేషన్ల అనంతరం కుట్లు వేసే విధానంపై (సూచరింగ్ టెక్నిక్స్) వర్క్‌షాప్ నిర్వహించారు. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ యతికాన్ సూచరింగ్ టెక్నిక్స్ పేరుతో నిర్వహించిన వర్క్ షాప్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు పొట్టకు, కాలికి, చేతికి, ముఖంపై కుట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన టెక్నిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులు నేర్చుకునేందుకు ఏసీ బస్సులో పది వర్కింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారని, నాలుగు రోజులపాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. నాలెడ్జ్ ఆన్ వీల్ నినాదంతో బస్సులో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ల్యాప్రోస్కోపిక్ సర్జరీ సమయంలో ఏవిధంగా కుట్లు వేయాలనే విషయాలను వైద్య విద్యార్థులకు వివరిస్తారని చెప్పారు. పీజీ వైద్యులతోపాటు, జూనియర్ వైద్యులు కూడా సూచరింగ్ టెక్నిక్స్ నేర్చుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వారు కోరారు.

సైబర్ నేరాలపై అవగాహనతోనే నియంత్రణ

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- 'సైబర్ వేలార్' లఘు చిత్ర పోటీల పోస్టర్ల ఆవిష్కరణ
- మోసాలు కట్టడి చేసేందుకు వీడియోలకు ఆహ్వానం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

నగరంపాలెం: సైబర్ నేరాల అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సైబర్ వేలార్ అనే లఘు చిత్ర పోటీల పోస్టర్లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సైబర్ నేరాలపై ప్రతి సబ్ డివిజన్‌లో లఘుచిత్రాల వీడియో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆరు సబ్ డివిజన్లకు సంబంధించి మూడు వీడియోలను ఎంపిక చేసి, విజేతలకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు అందిస్తామని చెప్పారు. సైబర్ నేరాలు పాల్పడేందుకు అవకాశాలు.. వాటికి గురికాకుండా ఉండడం.. బాధితుల కోసం చేపట్టాల్సిన చర్యలపై లఘు చిత్రాలు ఉండాలని తెలిపారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో ఇంటర్ లేదా డిగ్రీ లేదా పీజీ చదివే వారు అర్హులని చెప్పారు. ఒక్కో లఘు చిత్రంలో ఆరు లేదా ఏడుగురు ఉండాలని, నిడివి కనిష్ఠంగా ఐదు నిమిషాలు, గరిష్ఠంగా ఎనిమిది నిమిషాలని సూచించారు. వీడియోలు తెలుగు లేదా ఇంగ్లిష్ భాషల్లో రూపొందించి, ఈనెల 20లోగా సబ్ డివిజన్ అధికారులకు పంపించాలన్నారు. విజేతలకు 23న నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పంపించాల్సిన చిరునామాలు..

సబ్ డివిజన్ల వారీగా వీడియోలను గుంటూరు తూర్పు సబ్ డివిజన్‌లోని వారు sdpoeast@gmail .com, 9030101090, గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్‌లో వారు sdpowest@gmail.com, 8688831330, తెనాలి సబ్ డివిజన్‌లో తెనాలి–1, 2, 3, తెనాలి రూరల్, పొన్నూరు టౌన్, పొన్నూరు రూరల్, చేబ్రోలు పీఎస్‌ల పరిధిలో వారు sdpotnl@gmail.com, 8328251496, తుళ్లూరు సబ్ డివిజన్‌లో తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం పీఎస్‌ల పరిధిలో వారు aspofficethuulru@gmail.com, 8555941045, గుంటూరు ఉత్తర సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి రూరల్, మంగళగిరి టౌన్, తాడేపల్లి, దుగ్గిరాల, పెదకాకాని పీఎస్‌ల పరిధిలో వారు sdpo north@gmai com, 8688831620, గుంటూరు దక్షిణ సబ్ డివిజన్ పరిధిలో నల్లపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు పీఎస్‌ల పరిధిలో వారు shovckur@ gmail.com, 8688831613కు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి దీక్ష, జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య, ఎస్‌బీ సీఐలు శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా టీటీ జట్టు ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కాకినాడలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు గర్తపురి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నడింపల్లి వెంకట గురుదత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వివిధ వయస్సుల వారికి నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబరచిన వారిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. జట్లకు మేనేజర్‌గా కేఎస్‌ఎస్ఎస్ రాజు, కోచ్‌గా సరేంద్రలు వ్యవహరిస్తారని వెల్లడించారు.

ఎంపికైన వారి వివరాలు

పురుషులు– పి.తులసీరామ్, వై.ప్రభు సాయి, కె.రాజేష్, పి.యశ్వంత్ సాయి, పి.రఫీ **మహిళలు–** పి.హాసిని, కె.సుదీక్షిత, రఫీ మున్నిసా, రుష్మా ఫెర్దోష్ ఫిర్దోస్, మోక్షిత్ రెడ్డి **బాలురు–** యశ్వంత్ సాయి, కృష్ణ మనోహర్, రుత్విక్, సమన్మయ్, దుర్గా నాగ వెంకట్ **బాలికలు–** శాన్వి సుధాకర్, ఎస్‌కే షరీషా, సీహెచ్ యోగితా కృష్ణ, కె.సంజన

సోషల్ మీడియా కార్యకర్తపై కేసు నమోదు

న్యాయమూర్తి ఆదేశంతో 41ఏ నోటీసు ఇచ్చి పంపిన పోలీసులు

తెనాలి రూరల్: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టాడంటూ సోషల్ మీడియా కార్యకర్తపై అంగలకుదురుకు చెందిన టీడీపీ మహిళా నాయకురాలు జెట్టి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో సయ్యద్ సలీం అసభ్యకర పోస్టులు పెట్టాడని పేర్కొనడంతో ఆయనపై 120బి, 143ఏ, 354సి, 305 క్లాజ్ 2, 509, 506 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్‌లతో పాటు సైబర్ క్రైం సెక్షన్ 67ఏ కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, రిమాండ్ విధించేందుకు అంగీకరించలేదు. 41ఏ నోటీసు ఇచ్చి పంపే సెక్షన్‌లకు రిమాండ్ సరికాదని అభిప్రాయపడ్డారు. రిమాండ్ విధించేందుకు న్యాయమూర్తి అంగీకరించలేదని నిందితుడి తరపు న్యాయవాది బేతాళ ప్రభాకర్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ – ఇ–ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నిట్ నెం.46/జె.టి.ఓ/2024–25 ది. 09–12–2024

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ – సాధారణ నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనులకు గాను ఇ–ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

	మొత్తము పనులు – 04	అంచనా వ్యయము: రూ.16.49 లక్షలు
	పని నెం: 01 నుండి 08 వరకు:	
1	టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది.	ది.10–12–2024 ఉదయము గం. 11.00ని ల నుండి
2	టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది.	ది.13–12–2024 ఉదయము గం. 11.00ని ల వరకు
3	ప్రైస్ బిడ్ తెరుచు తేది	ది.13–12–2024 మధ్యాహ్నము గం.02.00ని లకు

మరిన్ని వివరములకు ఇ–ప్రొక్యూర్మెంట్ వెబ్సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

కమీషనరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ 450 ఎకరాల వెంచర్ నందు 11 సెంట్ల భూమి కేవలం రూ. 5,00,000/- మాత్రమే స్పాట్ రి. ఆవకాడో ఫ్రూట్ పై ప్రతీ నెం.లక్షల్లో ఆదాయం. గుంటూరు నుండి గంట ప్రయాణం. 83175 28192

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ☏ 91699 22299

PASSPORT MISSING

■ పండిట్ వీరయ్య S/o గోపయ్య, 70సం॥, నేను శారదా కాలనీ నుండి బయలుదేరి అరండల్‌పేట 8వలైను, ఐంటో జిరాక్స్ సెంటర్‌లో పాస్‌పోర్ట్ నెం. N8784803 పాస్‌పోర్ట్ పేపర్లు జిరాక్స్ తీయించుకొనుటకు టూవీలర్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో బ్యాగ్ పడిపోయినది. వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈ అడ్రస్‌కు ఇవ్వవలసినదిగా కోరుచున్నాము. శారదాకాలనీ, 10వలైను ఎదురు. సెల్ : 9866802749

WANTED

■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNCకంపెనీలో వర్క్‌ఫ్రంహోం సదుపాయంతో స్త్రీ పురుషులు కావలెను. Qul:-10th, డిగ్రీ నుండి జీతం ఉచిత రూమ్‌భోజనసదుపాయం9018041491,9110475386

■ వాచ్‌మెన్ కావలెను. బాపట్ల జిల్లా, రేపల్లె దగ్గర పిలేజిలో కళ్యాణ మండపం నందు పని చేయుటకు 40సం॥లలోపు భార్య భర్తలు కావలెను. వేతనము రూ.15,000/-నుండి రూ.17,000/-☏9849883681

■ పేరేచర్లలోని ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు జూ॥అకౌంటెంట్స్ పురుషులు కావలెను. అర్హత : ఇంటర్ to డిగ్రీ. జీతం: 15000 to 17000 ☏8185099994, 8185099996

■ తెనాలి అప్పడాల కంపెనీలో పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 15,000/- రూపాయలు సంప్ర॥ 9299993959

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- 10th to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9036993713

■ స్టోర్ కీపర్స్ కావలెను. అర్హతలు: ఒకటి లేదా రెండు సంవత్సరములు మెస్‌లో స్టోర్ కీపర్‌గా అనుభవం కలిగి ఉండాలి. విద్యార్హత: B.Com, జీతము : 15,000/-రూ॥లు, జీతంతో పాటు ఉచిత వసతి మరియు భోజనం సౌకర్యం కలదు. పని చేయుస్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 8978480429

■ గుంటూరు నందు గల మా సంస్థ శ్రీ బాలాజీ హోం నీడ్స్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. శాలరీ: 8000+ ఇన్సెంటివ్స్, అడ్రస్: సిటీ మార్కెట్. 8179243779, 9642981048

■ రామన్నబ్రిస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్‌బాయ్స్& సేల్స్‌గర్ల్స్ కావలెను. సైటీమేన్, ఇన్వర్టర్ సెల్స్ కూడా కావలెను.మంచిజీతం. రఘు మేన్షన్ 5/1 బ్రాడీపేట,గుంటూరు. ☏ 9391379724

■ Wanted Teaching and Non-Teaching Staff H.M, Clerk, Accountant for Moraiah High School, Pattaphipuram, Guntur. Cont: 0863-3566763, 8019535068

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ / పు కావలెను. వీక్లీ పేమెంట్స్ వివరాలకు మీ పేరు వాట్సాప్ చేయండి. సంప్ర॥ 9885682589

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ నందు గుంటూరులో పనిచేయుటకు కారుడ్రైవర్లు, లేడి టెలికాలర్స్, లేడి రిసెప్షనిస్ట్, ఆఫీ పనిమనిషి, మార్కెటింగ్ సిబ్బంది కావలెను. 7731951999

■ సైట్ సూపర్‌వైజర్స్ కావలెను. బిల్డింగ్ కన్స్ట్రక్షన్ నందు కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండవలెను. మ్యారేజ్ అయి ఉండవలెను. విద్యార్హతలు: బిటెక్ సివిల్ చేసి ఉండవలెను. జీతం: 15000/- నుండి 25000/- వరకు ఇవ్వబడును. పనిచేయు స్థలం: మాస్టర్‌మైండ్స్ గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 89784 80435

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత గల CSO, క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను. (M/F) ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి: 8074257503.

■ MS Pvt Ltd నందు టెలికాలింగ్ చేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ ఫిమేల్ కావలెను. Qly: 10th, జీతం : 16000 to 18000, Ph: 7416297427/9550853907

ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.